సాక్షి కామారెడ్డి

గురువారం । 13 । ఫిబ్రవరి । 2025



భక్తజన సందడి
డిచ్‌పల్లి ఖిల్లా రామాలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం నిర్వహించిన రథోత్సవం కనుల పండువగా సాగింది.
- 8లో ▸



అంధకారం
కామారెడ్డి పట్టణంలోని పలు కాలనీలలో వీధి దీపాలు వెలగడంలేదు. దీంతో రాత్రి వేళలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- 9లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 34.8 /18.0
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'వందశాతం ఉత్తీర్ణత సాధించాలి'



మాట్లాడుతున్న డీఈవో రాజు

ఎల్లారెడ్డి: ఎస్సెస్సీ వార్షిక పరీక్షలలో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో రాజు సూచించారు. బుధవారం ఎల్లారెడ్డిలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశం, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

ఎల్లారెడ్డిరూరల్: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని డీఈవో రాజు సూచించారు. బుధవారం ఆయన ఎల్లారెడ్డి కేజీబీవీని సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట ఎంఈవో వెంకటేశం, స్పెషల్ ఆఫీసర్ వీణ ఉన్నారు

రేపు కబడ్డీ సబ్ జూనియర్ జిల్లా జట్ల ఎంపిక

కామారెడ్డి అర్బన్: గాంధారి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కబడ్డీ సబ్ జూనియర్ జిల్లా బాల బాలికల జట్లను ఎంపిక చేయనున్నారు. ఈ విషయాన్ని కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటేశ్వరగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల 55 కిలోలలోపు బరువున్న క్రీడాకారులు ఆధార్, బోనఫైడ్ సర్టిఫికెట్లతో గాంధారికి రావాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 20 నుంచి 23 వరకు వికారాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఇతర వివరాలకోసం 93985 71110 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'ప్రమాదాల నివారణకు చర్యలు'



భవానీపేట వద్ద మూల మలుపును పరిశీలిస్తున్న ఏఎస్పీ చైతన్యరెడ్డి

మాచారెడ్డి : రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆమె పాల్వంచ మండలంలోని భవానీపేట మూలమలుపు వద్దనుంచి మాచారెడ్డి మండలం రాజ్‌ఖాన్‌పేట వరకు రోడ్డును పరిశీలించారు. తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న స్థలాలను గుర్తించి, అక్కడ ప్రమాద సూచికలను ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి ఈ మార్గంలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆమె వెంట కామారెడ్డి రూరల్‌సీఐ రామన్, మాచారెడ్డి ఎస్సై అనిల్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కామారెడ్డి క్రైం: రైతులు జిల్లాలో ఏర్పాటు చేసిన కంది కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ మహేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటన ద్వారా సూచించారు. జిల్లావ్యాప్తంగా 56,189 ఎకరాల్లో కంది పంట సాగయ్యిందని పేర్కొన్నారు. మద్నూర్, జుక్కల్, పిట్లం, బిచ్కుంద, తాడ్వాయి, బోర్లం, గాంధారి, పద్మాజీవాడిలలో కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. క్వింటాలుకు రూ. 7,550 మద్దతు ధర చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. రైతులు పంటను తీసుకుని వచ్చి గిట్టుబాటు ధర పొందాలని సూచించారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెన్షన్

నిజాంసాగర్ : కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం రాష్ట్ర కన్వీనర్ రామలింగం పార్టీనుంచి సస్పెన్షన్‌కు గురయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో ఆయనపై పార్టీ ఈ చర్య తీసుకుందని మండల కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ మేరకు పార్టీ ఓబీసీ విభాగం రాష్ట్ర చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు.

ఉపాధి కోసం యువత మళ్లీ గల్ఫ్ బాట పడుతోంది.
వ్యవసాయం అనుకూలించక.. ఉన్న ఊళ్లో సరైన పనులు దొరకక చాలామంది అప్పులు చేసి మరీ ఎడారి దేశాలకు పయనమవుతున్నారు. జిల్లావాసులు ఎక్కువగా దుబాయి, మస్కట్, కువైట్ తదితర దేశాలకు వెళ్తున్నారు.



మళ్లీ గల్ఫ్ బాట!

- జిల్లానుంచి పెరిగిన వలసలు
- స్థానికంగా పనులు దొరక్క ఎడారి దేశాలకు పయనం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : సాగు ఖర్చులు పెరగడం, వాతావరణ పరిస్థితులు అనుకూలించక సరైన దిగుబడులు రాకపోవడంతో వ్యవసాయం లాభాలను ఇవ్వడం లేదు. ఎంత చేసినా బట్ట, పొట్టకు కూడా సరిపోవడం లేదని రైతులు పేర్కొంటున్నారు. మరోవైపు స్థానికంగా చేయడానికి వేరే పనులూ లేక ఇబ్బందిపడుతున్నారు. పాలకులు పారిశ్రామిక ప్రగతి పేరుతో గొప్పలు చెబుతున్నా యువతకు ఉపాధి అవకాశాలు మాత్రం మెరుగు పడడం లేదు. దీంతో యువత వలసలపై దృష్టి సారిస్తోంది.

ఆశలు రేపుతూ..

గల్ఫ్ వలసలు పెరగడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఏజెంట్లు రంగ ప్రవేశం చేస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా గల్ఫ్‌లో ఉద్యోగ అవకాశాలపై పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. దీంతో చాలామంది యువకులు వారిని ఆశ్రయిస్తున్నారు. జిల్లాలోని కామారెడ్డి, బీబీపేట, దోమకొండ, సదాశివనగర్, మాచారెడ్డి, రామారెడ్డి, లింగంపేట, తాడ్వాయి, గాంధారి తదితర ప్రాంతాల నుంచి ఎక్కువ మంది గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో ఏజెంట్లు పుట్టుకొస్తున్నారు. గల్ఫ్ దేశాలలో నెలకు రూ.40 వేల నుంచి రూ.50 వేలు సంపాదించవచ్చని ఆశలు కల్పిస్తున్నారు. ఇక్కడ ఎంత పని చేసినా రూ. 10 వేలు కూడా సంపాదించే పరిస్థితులు లేకపోవడంతో చాలామంది గల్ఫ్ వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. అక్కడ మూడు నాలుగేళ్లు కష్టపడితే కుటుంబ సభ్యులకు మంచి భవిష్యత్ ఇవ్వవచ్చన్న ఉద్దేశంతో చాలా మంది దుబాయి, కువైట్, మస్కట్‌లాంటి దేశాలకు పయనమవుతున్నారు.

నిఘా అవసరం..

జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణం కేంద్రంగా కొందరు గల్ఫ్ ఏజెంట్లు వీసాల దందా నడిపిస్తున్నారు. ఆయా దేశాలకు పంపించేందుకు వీసా కోసం రూ. 1.20 లక్షలనుంచి రూ. 1.50 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. అక్కడ మంచి వేతనం దొరుకుతుందని నమ్మి చాలామంది ఏజెంట్లకు డబ్బులు చెల్లిస్తున్నారు. ఇక్కడ ఉపాధి అవకాశాలు లేకపోవడంతో వలసలు వెళ్లడానికి చాలామంది ఆసక్తి చూపుతుండడంతో ఏజెంట్ల మోసాలు పెరిగే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా గల్ఫ్ దేశాలకు వీసాలు తెచ్చి దందా సాగిస్తున్న వారి విషయంలో పోలీస్ యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఉపాధి వెతుక్కుంటూ గల్ఫ్ బాట పడుతున్న వారు కూడా అమాయకంగా ఏజెంట్ల మాటలు నమ్మి మోసపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

మరోసారి కులగణన సర్వే

- ఈనెల 16 నుంచి 28 వరకు...
- గతంలో పాల్గొనని వారికి అవకాశం
- జిల్లాలో 4,533 కుటుంబాలను సర్వే చేయనున్న బృందాలు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను మరోసారి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే అందరికోసం కాకుండా గతంలో సర్వేలో పాల్గొనని కుటుంబాలను ఈసారి సర్వే చేయనున్నారు. ఈనెల 16 నుంచి 28 వ తేదీ వరకు సర్వే సాగనుంది.

గతేడాది నవంబర్‌లో తొలి విడత సర్వే చేసిన విషయం తెలిసిందే. నవంబర్ 6 నుంచి 8 వ తేదీ వరకు ఎన్యుమరేటర్లు హౌస్ లిస్టింగ్ చేసి ఇళ్ల లెక్క తేల్చారు. తర్వాత ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేశారు. జిల్లాలో 3,08,096 కుటుంబాలు సర్వేలో పాల్గొన్నాయి. అయితే బీసీ జాబితా నుంచి ఎస్టీ జాబితాలో చేర్చాలని దశాబ్దాలుగా పోరాడుతున్న మధుర లంబాడాలు సర్వేను బహిష్కరించారు. జిల్లాలో నాలుగు మండలాల్లో మధుర లంబాడా తెగకు చెందిన 4,533 కుటుంబాలున్నాయి. వారంతా సర్వేకు దూరంగా ఉన్నారు. సర్వేలో పాల్గొనని కుటుంబాలు తమ వివరాలు ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలో సర్వే కోసం అధికారులు సిద్ధమవుతున్నారు. మరోసారి సర్వే చేస్తున్న నేపథ్యంలో మధుర లంబాడాలు ఈసారైనా పాల్గొంటారో లేదో చూడాలి.

'స్థానిక' ఎన్నికలపై సందిగ్ధం?

కులగణన సర్వేలో పాల్గొననివారి కోసం మరోమారు సర్వే నిర్వహించడానికి ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో 'స్థానిక' ఎన్నికలపై సందిగ్ధత నెలకొంది. పంచాయతీ ఎన్నికలతో పాటు మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు రేపోమాపో షెడ్యూల్ వస్తుందని భావించారు. అయితే ప్రభుత్వం మరోమారు కులగణన సర్వేకు పూనుకోవడంతో ఎన్నికలకు మరికొద్ది రోజులు ఆగాల్సిందేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లాలో 536 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవులతో పాటు 4,696 వార్డు స్థానాలకు, అలాగే 25 మండలాల జెడ్పీటీసీ స్థానాలు, 237 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే ఎన్నికల అధికారులు, పోలింగ్ సిబ్బందిని నియమించారు. ఎన్నికల శిక్షణ కార్యక్రమాలూ చేపట్టారు. అయితే ప్రభుత్వం మరోసారి కులగణన సర్వే నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎన్నికలకు మరికొంత కాలం ఆగాల్సిందేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గ్రామాభివృద్ధికి కృషి చేస్తా



షబ్బీర్ అలీని సన్మానిస్తున్న తిప్పాపూర్ గ్రామస్తులు

- తిప్పాపూర్‌వాసులతో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

భిక్కనూరు: తిప్పాపూర్ గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. బుధవారం తిప్పాపూర్ గ్రామస్తులు షబ్బీర్ అలీని ఆయన గృహంలో కలిసి సన్మానించారు. గ్రామంలో డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయించాలని, ఎడ్ల కట్టవాగుపై వంతెన నిర్మాణం కోసం రైల్వే అధికారులతో మాట్లాడాలని కోరారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ తిప్పాపూర్ గ్రామస్తులు తనకు, కాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచి అండగా ఉన్నారన్నారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భీంరెడ్డి, కిసాన్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కొండ సిద్దరాములు, నేతలు ధర్మయ్య, కస్తూరి మహేష్, కుర్ల సిద్దయ్య, గాండ్ల శ్రీనివాస్, డొంకని రత్నయ్య, గంపల కమలాకర్, శామర్తి జీవన్, స్వామి, ఇల్లందుల కిషన్, నారిగళ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్సీ అభ్యర్థి గంగాధర్

- నామినేషన్ విత్ డ్రా చేసుకుని మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో పార్టీలో చేరిక

ఆర్మూర్: కరీంనగర్ – నిజామాబాద్ – మెదక్ – ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన మదనం గంగాధర్.. తన నామినేషన్‌ను ఉపసంహరించుకుని కాంగ్రెస్‌లో చేరారు. సీనియర్ నాయకుడు వి.హన్మంత్‌రావుతో కలిసి బుధవారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌కు వచ్చిన గంగాధర్‌కు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆర్మూర్‌కు చెందిన మదనం గంగాధర్ చిన్నతనంలో భిక్షాటన చేశారు. పేపర్ బాయ్‌గా పని చేశారు. ఉన్నత విద్యాభ్యాసం చేసి పోలీసు శాఖలో ఎస్సైగా ఉద్యోగం సాధించి డీఎస్పీ స్థాయికి ఎదిగారు. గతేడాది నవంబర్‌లో వలంటరీ రిటైర్మెంట్ తీసుకొని ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలువనున్నట్లు ప్రకటించారు. గంగాధర్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసినప్పటికీ కాంగ్రెస్, బీజేపీల నుంచి బీ ఫామ్ ఆశించారు. చివరకు ఆ పార్టీల నుంచి బీ ఫామ్ దక్కకపోవడంతో తన నామినేషన్‌ను ఉపసంహరించుకుని కాంగ్రెస్‌లో చేరడం చర్చనీయాంశమైంది.



గంగాధర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

రైతులకు భరోసా!

రైతు భరోసా నిధులు విడతలవారీగా విడుదలవుతున్నాయి. అన్నదాతల ఖాతాలలో డబ్బులు జమ అవుతున్నాయి. ఇప్పటివరకు రెండెకరాలలోపు భూమి ఉన్న వారికి పెట్టుబడి సాయం అందింది. దీంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

- విడతలవారీగా నిధుల విడుదల
- రెండెకరాలలోపు భూమి ఉన్నవారికి అందిన సాయం
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



కామారెడ్డి క్రైం : నిధుల కొరత కారణంగా రైతు భరోసా పథకం అమలుపై అనేక సందేహాలు, విమర్శలు వచ్చాయి. సమయానికి పెట్టుబడి సాయం అందక చాలామంది రైతులు ఇబ్బందులు పడ్డారు. ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడి సాయం అందించకపోవడం, యాసంగి పంటల సాగు ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా పథకం అమలుపై స్పష్టత లేకపోవడంతో రైతులు ప్రభుత్వం తీరుపై అసహనానికి గురయ్యారు. అయితే ప్రభుత్వం ఎట్టకేలకు పెట్టుబడి సాయం అందించడానికి చర్యలు చేపట్టడంతో వారిలో ఆశలు చిగురించాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎంపిక చేసిన గ్రామాలలో లాంఛనంగా రైతుభరోసా ప్రారంభించిన సర్కారు.. విడతలవారీగా నిధులు విడుదల చేస్తోంది. ఇప్పటివరకు మూడు విడతల్లో కలిపి రెండెకరాలలోపు భూములున్న వారికి పెట్టుబడి సాయం అందించింది. జిల్లాలో రైతు భరోసా పథకానికి అర్హతలున్న రైతులు 3,25,713 మంది ఉన్నారు. వారికి పెట్టుబడి సాయం అందించడానికి రూ. 3.13 కోట్ల నిధులు అవసరం. కాగా ఇప్పటివరకు రెండెకరాల వరకు భూమి ఉన్న 1,73,751 మంది ఖాతాలలో నిధులు జమయ్యాయి. వచ్చేనెల 31వ తేదీలోపు మిగిలిన రైతుల ఖాతాలలో నిధులు జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

వచ్చే సీజన్‌పై సందేహాలు..

రాష్ట్రంలో కాంగ్రెస్ సారథ్యంలో ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు దాటింది. గత యాసంగిలో మాత్రమే రైతుభరోసా నిధులు జమ చేశారు. గత ప్రభుత్వం సాగుకు యోగ్యం కాని భూములకూ రైతుబంధు ఇచ్చి నిధులను దుర్వినియోగం చేసిందని, తాము అర్హులకే ఇస్తామని ప్రస్తుతం ప్రభుత్వం పేర్కొంది. ఇందుకోసం కమిటీ నివేదిక, మార్గదర్శకాల రూపకల్పన పేరిట కాలయాపన చేసి గత ఖరీఫ్‌లో రైతు భరోసా ఇవ్వలేదు. ప్రస్తుతం యాసంగి సీజన్‌కు సంబంధించిన సాయాన్ని విడతలవారీగా జమ చేస్తున్నారు. అయితే నిధుల కొరత ఎదుర్కొంటున్న సర్కారు.. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రైతుభరోసా ఇస్తుందా లేక గత ఖరీఫ్‌లోలాగే చేస్తుందా అన్న అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. సాగు పనులు ప్రారంభించే సమయంలోనే పెట్టుబడి సాయం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

సీజన్ ప్రారంభంలోనే ఇవ్వాలి



యాసంగి పంటల సాగు ప్రారంభమైన రెండు నెలల తర్వాత పెట్టుబడి సాయం అందింది. ఇప్పటివరకు రెండెకరాలలోపు భూమి ఉన్నవారికి డబ్బులు జమయ్యాయి. సీజన్ ప్రారంభంలోనే రైతుభరోసా నిధులు విడుదల చేస్తే మరింత ఉపయోగకరంగా ఉంటుంది.

– రాజు, దుబ్బ తండా, గాంధారి మండలం

ప్రతి రైతుకు అందేలా చూస్తాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులైన ప్రతి రైతుకు రైతు భరోసా అందేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎవరికైనా డబ్బులు జమ కాకపోతే వెంటనే స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించి వివరాలు అందజేయాలి. వారికీ పెట్టుబడి సాయం అందేలా చూస్తాం.

– తిరుమల ప్రసాద్, డీఏవో, కామారెడ్డి

అప్‌గ్రేడ్ కాక.. బోధన సాగక..



జువ్వాడి తరగతి గదిలో విద్యార్థులు

- గుర్జాల్, జువ్వాడి యూపీఎస్‌లలో వింత పరిస్థితి
- ఎనిమిదో తరగతి నిర్వహిస్తున్న గ్రామస్తులు
- స్కూళ్లను అప్‌గ్రేడ్ చేయని విద్యాశాఖ
- సబ్జెక్ట్ టీచర్లు లేక నష్టపోతున్న విద్యార్థులు

గాంధారి: చదివేందుకు విద్యార్థులున్నా పాఠాలు బోధించేందుకు సరిపడా ఉపాధ్యాయులు లేక గుర్జాల్, జువ్వాడి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలల(యూపీఎస్) విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివరాలిలా ఉన్నాయి. జువ్వాడి, గుర్జాల్ గ్రామాల్లోని ప్రాథమికోన్నత పాఠశాలల్లో గతంలో ఏడో తరగతి వరకు ఉండేది. విద్యాశాఖ అనుమతి లేకున్నా గ్రామస్తులే ఎనిమిదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేసుకున్నారు. ప్రస్తుతం జువ్వాడిలో 75 మంది విద్యార్థులు, ముగ్గురు టీచర్లు, గుర్జాల్‌లో 103 మంది విద్యార్థులు, ఆరుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. అయితే అధికారికంగా అప్‌గ్రేడ్ కాకపోవడంతో ఆయా పాఠశాలల్లో ఒక్క స్కూల్ అసిస్టెంట్ కూడా లేరు. ఎనిమిదో తరగతికి కూడా ఎస్జీటీలో బోధించాల్సిన పరిస్థితి ఉంది. దీంతో సబ్జెక్టు టీచర్లు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అప్‌గ్రేడ్ సమస్యతో భర్తీకాని పోస్టులు

గుర్జాల్, జువ్వాడి ప్రాథమికోన్నత పాఠశాలలను ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేయలేదు. గ్రామస్తులే అప్‌గ్రేడ్ చేసుకుని ఎనిమిదో తరగతి కొనసాగిస్తున్నారు. టీచర్ పోస్టుల కేటాయింపుకు ఇదే సమస్యగా మారింది. విద్యాశాఖ రికార్డుల్లో ఏడో తరగతివరకే ఉండడంతో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయలేదు. గ్రామస్తుల వినతితో జువ్వాడిలో వారానికి మూడు రోజుల చొప్పున ఇద్దరు టీచర్లు, గుర్జాల్ పాఠశాలకు ఒక టీచర్ తాత్కాలిక డిప్యుటేషన్‌పై వచ్చి పాఠాలు బోధిస్తున్నారు. అధికారులు స్పందించి అప్‌గ్రేడ్ సమస్యను పరిష్కరించి, ఉపాధ్యాయ పోస్టులను కేటాయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

టీచర్లను నియమించాలి



అధికారులు ఇంటింటికీ తిరుగుతూ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని, అన్ని సదుపాయాలు ఉంటాయని ప్రచారం చేస్తారు. కానీ వాస్తవంలో వేరేగా ఉంటుంది. సరిపడా టీచర్లు కూడా లేకపోవడంతో పిల్లలు నష్టపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే టీచర్లను కేటాయించాలి.

– మచ్చర్ల శ్రీకాంత్, జువ్వాడి గ్రామస్తుడు

సార్లు తక్కువున్నరు



ప్రభుత్వ పాఠశాలల్లో బాగా చదివిన సార్లుంటరని చెప్పిన్రు. అందుకే మా ఇద్దరు కొడుకులను సర్కారు బడిలోనే చదివిస్తున్న. కానీ ఎనిమిది తరగతులకు ముగ్గురే సార్లున్నరు. ఏడెనిమిది తరగతులకు పాఠాలు చెప్పే సార్లే లేరట. ఇప్పటికైనా సార్లను పంపాలె.

– సాయవ్వ, జువ్వాడి గ్రామస్తురాలు

ఉన్న పోస్టులు ఎత్తేశారు



గతంలో మా పాఠశాలలో ఆరు ఎస్జీటీ పోస్టులుండేవి. రేషనలైజేషన్ పేరుతో మూడింటిని ఎత్తేశారు. ప్రస్తుతం తరగతులకు సరిపడా టీచర్లు లేరు. దీంతో కొందరు విద్యార్థులు టీసీలు తీసుకుని వెళ్లిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలి.

–ప్రకాశ్, హెచ్‌ఎం, జువ్వాడి

సాంకేతిక ఇబ్బందులున్నాయి

ఈ రెండు పాఠశాలలను ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేయలేదు. గ్రామస్తులే అప్‌గ్రేడ్ చేసుకున్నారు. దీంతో స్కూల్ అసిస్టెంట్ పోస్టుల మంజూరు సాధ్యం కావడంలేదు. విద్యార్థులు నష్టపోవద్దన్న ఉద్దేశంతో డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయులను పంపిస్తున్నాం.

– శ్రీహరి, ఎంఈవో, గాంధారి

క్లుప్తంగా

డెయిరీ కళాశాల సందర్శన



కామారెడ్డి అర్బన్: ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ బృందం బుధవారం జిల్లాకేంద్రంలోని పీవీ నర్సింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయం డెయిరీ టెక్నాలజీ కళాశాలను సందర్శించింది. బృంద సభ్యులు డెయిరీ కళాశాలలోని వివిధ విభాగాలు, ల్యాబ్‌లు, బాలురు, బాలికల వసతి గృహాలు, డెయిరీ ఫాంలను పరిశీలించారు. కళాశాల గురించి కళాశాల అసోసియేట్ డీన్ సురేష్ రాథోడ్, అసోసియేట్ ప్రొఫెసర్ కేఎస్.ఉమాపతి ఐసీఏఆర్ బృందం ఏఆర్‌టీ సభ్యులు ఏకే పునియా, ఎం.మహేందర్‌లకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఆచార్యులు, అధ్యాపకులు జి.స్వర్ణలత, కరీముద్దీన్, అబ్దుల్ ముకీద్, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మాచారెడ్డి: గజ్యానాయక్ తండా చౌరస్తాలో బుధవారం రాత్రి ట్రాక్టర్ ఢీకొని ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని చుక్కాపూర్ గ్రామానికి చెందిన పెద్దోళ్ల నరేశ్ ద్విచక్రవాహనంపై చౌరస్తా నుంచి చుక్కాపూర్ వెళ్తుండగా కామారెడ్డి, సిరిసిల్ల రహదారిపై ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. నరేశ్‌కు తీవ్ర గాయాలవ్వడంతో చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మున్నూరు కాపు నేతల ముందస్తు అరెస్టు



కామారెడ్డిఅర్బన్/భిక్కనూరు/రాజంపేట: రాష్ట్ర ప్రభుత్వం కులగణనలో మున్నూరుకాపు జనాభాను తక్కువ చేసి చూపించారని.. ఇందుకు నిరసనగా రాష్ట్ర సంఘం పిలుపు మేరకు హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఇంటి ముట్టడికి బయలుదేరిన జిల్లా మున్నూరుకాపు సంఘం నాయకులను వివిధ మండలాల్లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నేతలు నినాదాలు చేశారు.

భక్తజన సందడి

- వైభవంగా సీతారాముల రథోత్సవం
- డిచ్‌పల్లి ఖిల్లాకు భారీగా తరలివచ్చిన భక్తులు



రథోత్సవానికి ముందు భక్తుల పూజలు అందుకుంటున్న సీతారామ స్వామి



రథ హోమం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఆలయ కమిటీ, వీడీసీ సభ్యులు, భక్తులు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి శ్రీ సీతారాముల ఉత్సవ విగ్రహాలను రథంపై ఊరేగించారు. ఆలయ ప్రధానార్చకులు సుమిత్‌శర్మ దేశ్‌పాండే ఆధ్వర్యంలో ఉదయం నిత్య హోమం, బలిహరణం, సాయంత్రం హోమం, బలిహరణం, రథప్రతిష్ఠ, రథహోమం, బలిహరణం అనంతరం రథోత్సవం నిర్వహించారు. యాజ్ఞికులు భార్గవాచార్య, అర్చకులు ఆర్యన్ పాండే, గోపాల్ శర్మ, పంకజ్‌శర్మ, కాకర్ల ప్రవీణ్, దేశ్‌పెద్ది ప్రసాద్, ప్రవీణ్ దేశ్‌పాండే, రామారావు దేశ్‌పాండే తదితరులు సుమారు రెండు గంటలపాటు విశేషపూజలు చేపట్టారు. రాత్రి 10 గంటలకు ప్రారంభమైన ఊరేగింపు తెల్లవారుజాము 3గంటల వరకు కొనసాగింది. ఇళ్ల ముంగిటకు వచ్చిన శ్రీ సీతారామచంద్రస్వామి వారికి సుహాసినులు మంగళహారతులతో స్వాగతం పలికి కొబ్బరికాయలు సమర్పించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్‌గుప్తా, ఆలయ కమిటీ చైర్మన్ జంగం శాంతయ్య, గజవాడ జైపాల్, బూస సుదర్శన్, యాదగిరి, గడ్డం కిష్టారెడ్డి, గురడి నర్సారెడ్డి, గజవాడ రాములు, మహేందర్‌రెడ్డి, గడ్డం లక్ష్మణ్, ఏజీ దాస్, గడ్డం నర్సారెడ్డి, సున్నం పోశెట్టి, సూర మాధురి, ఆసది జితేందర్, గజవాడ విజయనాథ్, రేణుకాదాస్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు వన విహారం.. చక్రతీర్థం

ఉత్సవాల్లో భాగంగా గురువారం గ్రామ శివారులోని అంగడి మాముళ్ల వద్ద శ్రీ సీతారాముల వనవిహారం(జాతర), చక్రతీర్థం నిర్వహించనున్నారు. సాయంత్రం స్వామి వారికి గజసేవ నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకులు సుమిత్‌శర్మ దేశ్‌పాండే తెలిపారు.

సంక్షిప్తం

బెల్ట్ షాపులు నిర్వహిస్తే జరిమానా

లింగంపేట(ఎల్లారెడ్డి): సజ్జన్‌పల్లిలో బెల్టు షాపులు నిర్వహిస్తే రూ.లక్ష జరిమానా విధిస్తామని గ్రామ పెద్దలు తీర్మానించారు. బుధవారం గ్రామస్తులు ఏకమై సమావేశం నిర్వహించారు. గ్రామంలో మద్యం సేవించడం వల్ల కుటుంబాల ఆర్థిక పరిస్థితులు చిన్నాభిన్నం అవుతున్నాయని, దాంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో గ్రామంలోని పెద్దలు, యువకులు, మహిళలు, వృద్ధులు సమావేశం నిర్వహించి కొన్ని కట్టుబాట్లు ఏర్పాటు చేసుకున్నారు. అందులో గ్రామంలో ఎవరైనా కిరాణం దుకాణాల్లో మద్యం అమ్మితే రూ.లక్ష జరిమానా కట్టాల్సి ఉంటుందని తీర్మానం చేసుకున్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని సూచించారు. గ్రామంలో బెల్టు షాపులు నిర్వహిస్తే పోలీసులు కూడా చర్యలు తీసుకోవాలని కోరారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ



బాన్సువాడ రూరల్: రాంపూర్ తండాకు చెందిన రైతు కేతావత్ బన్సీలాల్ కుమారుడు గోవింద్ జేఈఈ మెయిన్స్‌లో 97.2 పర్సంటైల్ స్కోర్ సాధించాడు. ఇదే స్ఫూర్తితో జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో కూడా రాణించి పేరుగాంచిన యూనివర్సిటీలో సీటు సాధిస్తానని గోవింద్ తెలిపారు. మారుమూల తండాకు చెందిన పేదింటి రైతుబిడ్డ జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ సాధించడంతో తండా పెద్దలు, యువకులు అభినందించారు.

ఆరోగ్య ఉపకేంద్రాల పరిశీలన



కామారెడ్డి రూరల్: క్యాసంపల్లి, చిన్నమల్లారెడ్డి ఆరోగ్య ఉప కేంద్రాలలో బుధవారం నిర్వహిస్తున్న టీకాల ప్రక్రియను ఆరోగ్య విస్తరణాధికారి త్రివిక్రమాచారి, ఆరోగ్య పర్యవేక్షకులు నాగేంద్రమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని కుటుంబ సభ్యులకు వివరించారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

'ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తే సహించం'



కామారెడ్డి క్రైం: రోడ్ల పక్కన వాహనాలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తే ఇకపై సహించేది లేదని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, ప్రధాన కూడళ్ల వద్ద రాంగ్ పార్కింగ్ వాహనాల విషయంలో బుధవారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. రాంగ్ పార్కింగ్ చేసిన 8 కార్లు సహా మొత్తం 24 వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం మోటారు వాహనాల చట్టం ప్రకారం చలాన్లు విధించారు. నిబంధనల ప్రకారంగా వాహనాలను ఎవరికీ ఇబ్బంది కలుగకుండా పార్కింగ్ చేయాలని ఎస్‌హెచ్‌వో సూచించారు. ట్రాఫిక్ ఎస్సై మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

యుద్ధభేరి వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



లింగంపేట(ఎల్లారెడ్డి): తెలంగాణ సీపీఎస్‌ఈయూ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా అధ్యక్షుడు కుంట ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో లింగంపేట మండలం శెట్పల్లి ఉన్నత పాఠశాలలో బుధవారం సీపీఎస్‌పై యుద్ధభేరి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుంట ఎల్లారెడ్డి మాట్లాడారు. యూపీఎస్ విధానానికి వ్యతిరేకంగా మార్చి 2న హైదరాబాదులోని ధర్నా చౌక్‌లో యుద్ధభేరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం తెస్తున్న యూపీఎస్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరారు. ఓపీఎస్ వచ్చే వరకు ఉద్యమాలు ఆగవని హెచ్చరించారు. ధర్నాకు ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్, ఉద్యోగులు రాము, రవి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్, రవిబాబు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్ ఇప్పించండి సారూ..!

- రోడ్డు ప్రమాదంతో నడవలేని స్థితిలో బీబీపేట యువకుడు

కామారెడ్డి టౌన్: హైదరాబాద్‌కు ఉపాధి కోసం వెళ్లిన ఆ యువకుడికి విధి వక్రీకరించింది. మూడేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంతో ఆ యువకుడి రెండు కాళ్లు విరిగిపోయాయి. ఎముకలు నుజ్జునుజ్జు కావడంతో ఆపరేషన్ చేసినా కోలుకోలేకపోతున్నాడు. పూర్తిగా నడవడం కష్టమని వైద్యులు సైతం తేల్చేశారు. దీంతో ఆ యువకుడు నడవలేని స్థితిలో ఇంట్లోనే కాలం వెల్లదీస్తున్నాడు. కనీసం దివ్యాంగుడని నిర్ధారిస్తే ఫించన్ అయినా వస్తుందని ఆశతో ఏడాదిగా కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో జరుగుతున్న సదరం క్యాంపునకు ఇప్పటి వరకు 10 సార్లు వచ్చాడు. బీబీపేట మండలం కేంద్రానికి చెందిన 24 ఏళ్ల యువకుడు కొమిరే నరేందర్ బాధ ఇది. తండ్రి చిన్ననాడే మరణించడంతో కన్న తల్లే.. నరేందర్ అన్ని బాగోగులు చూసుకోవాల్సి వస్తోంది. సదరం శిబిరంలో వైద్యులు పరీక్షించి దివ్యాంగుడిగా అర్హుడని నిర్ధారించినా సాంకేతిక లోపం, ఓటీపీ రావడం లేదంటూ సర్టిఫికెట్ జారీ చేయడం లేదని నరేందర్ సాక్షితో వాపోయాడు. ఉపాధి కోల్పోయి ఇంటి పట్టునే ఉంటున్నానని, ప్రభుత్వం ఆదుకోవాలని రెండు చేతులు జోడించి వేడుకుంటున్నాడు.



వేడుకుంటున్న బాధితుడు నరేందర్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి



మాట్లాడుతున్న బీజేవైఎం నేత మహేందర్



చిన్నమల్లారెడ్డిలో సమావేశమైన బీజేపీ నేతలు

- బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్

కామారెడ్డి టౌన్: ఉపాధ్యాయ, పట్టభద్రుల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సెవెళ్ల మహేందర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఓటర్లను కలిసి బీజేపీ అభ్యర్థులకు మొదటి ప్రాధన్యత ఓటు వేసేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. అలాగే త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు నంది వేణు, ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లా ఇన్‌చార్జి జయశ్రీ , నాయకులు ప్రభారీ సూదింద్ర, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం

కామారెడ్డి రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా చిన్నమల్లారెడ్డిలో బుధవారం సన్నాహక సమావేశం బీజేపీ మండల అధ్యక్షుడు చందన శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలు ఎంతో కీలకమని, బీజేపీ బలపరిచిన పట్టభద్రుల అభ్యర్థి అంజిరెడ్డిని, ఉపాధ్యాయ అభ్యర్థి మల్క కొమురయ్యకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాల్సిందిగా మండలంలోని ప్రతి ఓటరును అభ్యర్థించాలని సూచించారు.

'సోయా' కొనుగోలు చేయట్లేదని చెట్టెక్కాడు

మద్నూర్(జుక్కల్): ప్రభుత్వ సోయా కొనుగోలు కేంద్రాన్ని ఎలా నిలిపేస్తారని.. సోయా పంట అమ్మకుండా అప్పు ఎలా చెల్లించాలని ప్రశ్నిస్తూ డోంగ్లీ మండలంలోని లింబూర్ గ్రామ రైతు భూమయ్య బుధవారం స్థానిక మార్కెట్ యార్డులో గల చెట్టుపై ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించారు. ప్రభుత్వం నుంచి సోయా పంట కొనుగోలుపై త్వరలో ఉత్తర్వులు వస్తాయని.. ఆవేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దని రైతులు సముదాయించడంతో భూమయ్య చెట్టుపై నుంచి కిందకు దిగారు. ఈ విషయం తెలిసి సొసైటీ కార్యదర్శి బాబూరావ్, ఎస్సై విజయ్‌కొండ, మార్కెట్ కమిటీ అధికారులు హుటాహుటిన తరలివచ్చి రైతు సమస్యను అడిగి తెలుసుకున్నారు. చాలా రోజులుగా కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకొచ్చిన సోయా పంట అలాగే ఉందని, మధ్యలోనే ఇలా కొనుగోలు కేంద్రాన్ని బంద్ చేయడమేమిటని అక్కడే ఉన్న పలువురు రైతులు, అధికారులను ప్రశ్నించారు. ఉన్నతాధికారులకు విషయాన్ని వివరించామని త్వరలో పంట కొనుగోలు ఉత్తర్వులు వస్తాయని సూచించడంతో రైతులు శాంతించారు.



మద్నూర్‌లో చెట్టు ఎక్కిన రైతు

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం



భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన తిరుపతి అదృశ్యమైనట్లు ఎస్సై ఆంజనేయులు బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. జంగంపల్లి గ్రామానికి చెందిన మంగలపల్లి లక్ష్మితో దోమకొండకు చెందిన తిరుపతికి 30ఏండ్ల క్రితం వివాహమైంది. వీరి కుమారుడు ప్రవీణ్ నెల క్రితం గల్ఫ్‌కు వెళ్లాడు. మతిస్థిమితం లేక తిరుపతి పలుమార్లు ఇంటి నుంచి బయటకు వెళ్లి కొన్ని రోజుల తర్వాత వచ్చేవాడు. గత 15రోజులుగా తిరుపతి కనిపించడం లేదని భార్య లక్ష్మి ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇస్రోజీవాడిలో మరొకరు..



కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామానికి చెందిన కొత్త రాజు అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 10న కల్లు దుకాణంలో పని ఉందని చెప్పి ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదు. మొబైల్ స్విచ్చాఫ్ ఉండటంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. రాజు భార్య భూలక్ష్మీ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

క్రైం కార్నర్

కారులో పెట్టిన రూ. 2లక్షలు చోరీ

బాన్సువాడ: కొబ్బరిబొండం తాగి వచ్చేలోపే కారులో ఉన్న రూ.2లక్షలు చోరీకి గురైన ఘటన బాన్సువాడలో చోటు చేసుకుంది. సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామానికి చెందిన చందర్ ఈ నెల 10న బ్యాంకు నుంచి రూ. 2 లక్షల నగదు డ్రా చేసుకొని కారులో పెట్టాడు. అనంతరం ఏరియా ఆస్పత్రి వద్ద కారు నిలిపి కొబ్బరిబొండం తాగేందుకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి కారులో ఉన్న నగదు మాయమైంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలంలోని సీసీ ఫుటేజీని పరిశీలించారు. ఓ వ్యక్తి కారు డోర్ తీసి నగదు తీసుకెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. కారు డోర్లకు లాక్ వేయకపోవడంతోనే చోరీ జరిగినట్లు తెలిసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మొరం టిప్పర్ పట్టివేత



ఖలీల్‌వాడి: నగరంలోని ఐదో టౌన్ పరిధిలో మొరం అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. టిప్పర్ యజమాని బొల్లం నర్సయ్యతో పాటు డ్రైవర్ ఎత్తరి చిన్నకొండయ్యపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఇసుక, మొరం అక్రమ రవాణాకు పాల్పడిన వారిలో నాగారం వడ్డెర కాలనీకి చెందిన మక్కల గోపాల్, దండ్ల సాయికుమార్, మల్లారం గ్రామానికి చెందిన బొల్లం నర్సయ్య, మమ్మాయి అరుణ్, బొల్లం నర్సయ్యను నిజామాబాద్ దక్షిణ మండల తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.


తారకరామ్‌నగర్‌లో ఇసుక లారీ..

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కంఠేశ్వర్ బైపాస్ వద్ద తారక రామ్‌నగర్‌లో ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకొని సీజ్ చేసినట్లు ట్రైనీ ఐపీఎస్ సాయికిరణ్ బుధవారం తెలిపారు. ఇసుక, మొరం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టుకున్న లారీని రూరల్ పీఎస్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ యజమానికి జరిమానా

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను నాగిరెడ్డిపేట ఫారెస్ట్ రేంజ్ అధికారులు పట్టుకున్నారు. వివరాలు ఇలా.. మెదక్ జిల్లా రాజ్‌పేటతండాకు చెందిన సోమ్లా ఎలాంటి అనుమతి లేకుండా తన ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా లింగంపేట మండలం కన్నాపూర్ గ్రామ శివారులో పట్టుకున్నట్లు ఎఫ్ఆర్వో వాసుదేవ్ తెలిపారు. ట్రాక్టర్ యజమానికి రూ.10వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవికుమార్, బీట్ ఆఫీసర్ సమ్రీన్, బేస్‌క్యాంపు గోపాల్ ఉన్నారు.

గోదావరిలో యువకుడి గల్లంతు



సాయిబాబా

రెంజల్(బోధన్): కందకుర్తి త్రివేణి సంగమంలో పుణ్యస్నానమాచరించేందుకు వచ్చిన ఓ యువకుడు గల్లంతైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. రెంజల్ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ శంకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోటగిరి మండల కేంద్రానికి చెందిన సాయిబాబా, అతని మేనమామ మక్కయ్య బుధవారం కందకుర్తి గోదావరికి వచ్చారు. స్నానం చేసేందుకు ఇద్దరు కలిసి నదిలో దిగారు. కాసేపటికి మక్కయ్య బయటకు రాగా, సాయిబాబా రాలేదు. స్థానికులు గాలించినా జాడ తెలియకపోవడంతో మక్కయ్య వెంటనే కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఈ విషయమై కోటగిరి పోలీసులకు తెలుపగా వారు బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. సీఐ ఆదేశాలతో రెంజల్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని సాయిబాబా గల్లంతైనట్లు గుర్తించారు. స్థానిక జాలర్లను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. భార్య సుష్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురు మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

వర్ని: మండల కేంద్రంలోని జాకోర క్రాస్‌రోడ్డు వద్ద బస్సు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై రమేష్ తెలిపారు. మంగళవారం రాత్రి బాన్సువాడ నుండి నిజామాబాద్ వైపు వెళ్తున్న బస్సు గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని నిజామాబాద్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడి వయసు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందని, వివరాలకు వర్ని పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై సూచించారు.

కుంటలో పడి రైతు..



బాలయ్య మృతదేహం

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని ఒడ్డేపల్లి గ్రామ శివారులో ఉన్న పాపేశ్వరుని కుంటలో పడి కంట్రెపల్లి బాలయ్య(60) అనే రైతు బుధవారం మృతి చెందినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. కుంట తూము నుంచి పొలానికి నీరు పారించేందుకు వెళ్లిన బాలయ్య ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడని పేర్కొన్నారు. మృతుడి కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి శివారులో జాతీయ రహదారి 44పై బుధవారం ఉదయం సుమారు 4గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని, గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారిపై కాలినడకన వెళ్తున్న సుమారు 55 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతుడు లుంగీ, తెల్ల చొక్కా ధరించి ఉన్నాడని, కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. వివరాలకు ముప్కాల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

విద్యుదాఘాతంతో చెరుకు కూలీ మృతి



వెంకటి (ఫైల్)

మాచారెడ్డి : చెరుకు నరకడానికి వచ్చిన ఓ వలస కూలీ విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన బుధవారం పాల్వంచ మండలం ఆరెపల్లిలో చోటు చేసుకుంది. మాచారెడ్డి ఎస్సై అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపేట మండలం ఎక్కపల్లితండాకు చెందిన కొర్ర వెంకటి (25) మూడు నెలలుగా చెరుకు నరకుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆరెపల్లిలో చెరుకు నరకడం పూర్తి చేసుకున్న తర్వాత నివాసం కోసం వేసుకున్న గుడిసెను సర్దుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. తోటి కూలీలు వెంకటిని చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో ఇంటర్ విద్యార్థి..



అరవింద్ (ఫైల్)

దోమకొండ: మండలంలోని అంబారిపేట గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి నీల అరవింద్(19) అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కామారెడ్డిలోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అరవింద్ రెండు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతుండగా ఆస్పత్రిలో చూపించారు. మంగళవారం రాత్రి నుంచి వాంతులు, విరేచనాలవుతుండడంతో కుటుంబీకులు కామారెడ్డిలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు.

చేపల వేటకు వెళ్లి మరొకరు..



రాజశేఖర్ (ఫైల్)

భిక్కనూరు: చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతి చెందినట్లు భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు బుధవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన చెట్లపల్లి రాజశేఖర్ (33) ఈ నెల 10న ఉదయం చేపలు పట్టేందుకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. భిక్కనూరు బొబ్బిలి చెరువు గట్టుపై చెప్పులు, టీషర్టు, ప్యాంట్, సెల్‌ఫోన్ కనిపించాయి. చెరువులో గాలించగా రాజశేఖర్ మృతదేహం లభించింది. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించి, మృతుడి తండ్రి లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల కేంద్ర సమీపంలోని గాంధీనగర్‌లో పోలీసులు బుధవారం రేషన్ బియ్యం పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారంతో ఎస్సై అనిల్‌రెడ్డి సిబ్బందితో కలిసి కొండపల్లి లక్ష్మణ్ ఇంట్లో తనిఖీ చేసి 5.20 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. పంచనామా అనంతరం కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

ట్రాక్టర్ దొంగల రిమాండ్

- కొనుగోలు చేసిన వ్యక్తి సైతం..

బాల్కొండ: ట్రాక్టర్ ఇంజన్, ట్రాలీ చోరీ కేసులో నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బాల్కొండ పీఎస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. బాల్కొండ మండలం నాగాపూర్ గ్రామానికి చెందిన ఎంబరి మహేశ్ గత ఆదివారం తన పొలం వద్ద ట్రాక్టర్ ఇంజన్‌తోపాటు ట్రాలీని నిలిపిఉంచాడు. కోటగిరి మండలం సుంకిని గ్రామానికి రాజు, ఏర్గట్ల మండలం తొర్తికి చెందిన మందుల అరవింద్, నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రాంటెక్‌కు చెందిన తమ్మల రవి ఆదివారం రాత్రి ట్రాక్టర్, ట్రాలీని దొంగిలించారు. అనంతరం వాటిని మహారాష్ట్రకు చెందిన విఠల్ మోహన్‌కు విక్రయించారు. కేసు దర్యాప్తులో భాగంగా నాగాపూర్‌లో ఉండే మందుల అరవింద్ కనిపించకపోవడంతో పోలీసులు ఆరా తీసి నిందితులను పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను కొనుగోలు చేసిన విఠల్ తోపాటు ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. నిందితుడు రాజు గతంలో దొంగతనాలు చేసి ఆరుసార్లు జైలు శిక్ష అనుభవించాడన్నారు. మూడు రోజుల్లో కేసును ఛేదించి దొంగలను పట్టుకున్న ముప్కాల్ ఎస్సై రజనీకాంత్ తోపాటు సిబ్బందిని అభినందించారు.



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి

తనిఖీల్లో పట్టుబడ్డ బంగారం



ఖలీల్‌వాడి: ఇళ్లలో చోరీకి పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు సౌత్ సీఐ సురేశ్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని అర్సపల్లిలో బుధవారం వాహనాల తనిఖీలో భాగంగా స్కూటీపై వెళ్తున్న షేక్ అఫ్తాబ్‌పై పోలీసులకు అనుమానం కలిగింది. దీంతో వాహనాన్ని పూర్తిగా తనిఖీ చేయగా డిక్కీలో బంగారు ఆభరణాలతోపాటు దొంగతనాలకు ఉపయోగించే వస్తువులు లభించాయి. వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకుని తొమ్మిదిన్నర తులాల బంగారు ఆభరణాలు, రెండు వాచీలు, ఒక సెల్‌ఫోన్, స్కూటీ, రూ. 15వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మూడు ఇళ్లలో చోరీకి పాల్పడినట్లు నిందితుడు ఒప్పుకున్నాడని పేర్కొన్నారు. కేసును ఛేదించిన ఎస్సై వెంకటరావు, సిబ్బందిని అభినందించారు.